ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

రిక్తహస్తం

- మెట్రోకు మొండిచేయి
- కోస్తా రైలు మార్గం ఊసేలేదు
- పారిశ్రామిక కారిడార్ విస్మరణ
- మరుగున పడిన మిస్సైల్ లాంచింగ్ కేంద్రం

ప్రజాశక్తి - కృష్ణా, విజయవాడ ప్రతినిధులు


పార్లమెంటులో గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ (తాత్కాలిక బడ్జెట్) ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లా వాసులను నిరాశకు గురిచేసింది. రెండు జిల్లాల పురోభివృద్ధికి అవసరమైన కీలక ప్రాజెక్టుల గురించి కనీస ప్రస్తావన లేకుండాపోయింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టు, కోస్తా రైలు మార్గం, విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్ల ఊలే లేకుండా పోయింది. దీంతో రెండు జిల్లాల ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు.

సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగాన్ని గట్టేక్కించే ప్రయత్నాలు బడ్జెట్లో కనిపించలేదు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన గురించి బడ్జెట్ ప్రసంగంలో ఘనంగా చెప్పారు. బీమా నిబంధనల కారణంగా మిచౌంగ్ తుపానుకు నష్టపోయిన జిల్లాలోని ఏ ఒక్క రైతుకు బీమా అందే పరిస్థితి లేకుండా పోయింది. నానో ఎరువులకు ప్రోత్సాహాలు ప్రకటించిన కేంద్రం...వ్యవసాయంలో రైతులు అత్యధికంగా వినియోగించే రసాయన ఎరువుల సబ్సిడీకి అవసరమైన కేటాయింపులు చేయలేదని నిపుణులు చెబుతున్నారు. దీంతో రసాయన ఎరువులు ధరలు తమకు పెనుభారంగా మారతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజిల్లాకు నీటి అవసరాలను తీర్చే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన నిధుల ప్రస్తావన లేదు.

(వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతల అభిప్రాయాలు 6వ పేజీలో)


కోస్తా రైలు మార్గం డిపిఆర్‌కు నిధులు లేవు

కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం అనుసంధానంగా ముందుకు వచ్చిన కోస్తా లింకు రైలు మార్గం ఏర్పాటుకు ఎటువంటి నిధులు కేటాయించలేదు. డిపిఆర్ తయారీకి అవసరమైన రూ.150 కోట్లు గురించి ప్రస్తావలేదు. కోటిపల్లి, అమలాపురం, రాజోలు, నరసాపురం మీదుగా మచిలీపట్నం- రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల వరకు 164 కిలోమీటర్ల లింకు రైలు మార్గం సమగ్ర నివేదిక (డిపిఆర్) తయారీకి ఉత్తర్వులు ఇచ్చిన కేంద్రం ఈ ప్రక్రియ కు అవసరమైన నిధులు కేటాయించలేదు.



కారిడార్‌ను, మిస్సైల్ కేంద్రాన్ని విస్మరించిన కేంద్రం

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్లో భాగంగా ఉన్న కృష్ణాజిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలికవసతులు, ప్రత్యేక ప్రోత్సాహాలకు బడ్జెట్లో చోటు దక్కలేదు. నాగాయలంక మండలం గుల్లలమోదలో ఏర్పాటు చేయాల్సిన మిస్సైల్ లాంచింగ్ కేంద్రానికి కూడా ఎటువంటి కేటాయింపులు జరగలేదు.





మెట్రో రైలు ఇక లేనట్లేనా ?

విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోంది. మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించడం లేదు. మెట్రో నిర్మాణానికి ఈ దఫా కూడా మొండిచేయి చూపింది. రాష్ట్ర విభజన జరిగిన ఏడాదిలోగా విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో రైళ్ల ఏర్పాటకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి దానికి సంబంధించిన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేయాలని విభజన చట్టంలోని 13వ షెడ్యూల్లో పొందుపరచారు. ఈ నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలను నిర్ణీత సమయంలోనే కేంద్రానికి పంపింది. అయితే 2017 మెట్రోరైల్ పాలసీ ప్రకారం మళ్లీ ప్రతిపాదనలను పంపాలని రాష్ట్రానికి సూచించింది. అయితే ఈలోగా 2019 ఎన్నికలు రావడం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం జరిగి పోయాయి. అయితే వైసిపి ప్రభుత్వం కూడా కేంద్రానికి ప్రతిపాదనలను పంపలేదు.

విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును మూడు దశల్లో పూర్తి చేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి గన్నవరం వరకు మొదటి ఫేజ్‌లో 25.9 కిమీ, పిఎన్‌బిఎస్ నుంచి పెనుమలూరు వరకు రెండో దశలో 12.50 కిమీ, పిఎన్‌బిఎస్ నుంచి అమరావతి వరకు మూడో దశ కింద 28 కిమీ దూరం వరకు, (మిగతా 6లో)

ఎపి భూహక్కు చట్టం-2022ను ఐక్యంగా వ్యతిరేకించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022ను ప్రజలంతా ఐక్యంగా వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. బెజవాడ బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ సివిల్ కోర్టుల వద్ద ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022 రద్దు చేయాలని న్యాయవాదులు చేస్తున్న దీక్షలను గురువారం ఆయన సందర్శించి (మిగతా 6లో)



న్యాయవాదుల దీక్షల్లో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

పశ్చిమ సీటివ్వాలని బుద్దా వెంకన్న ర్యాలీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ టిడిపి టికెట్‌ను తనకు కేటాయించాలని మాజీ ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు విజ్ఞప్తి చేశార. పశ్చిమ సీటుగా, అమలాపురం ఎంపి సీటుగానీ తనకు కేటాయించాలని కోరుతూ గురువారం తన ఇంటి వద్దనుంచి దుర్గగుడి వరకు తన అనుచరులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ఇచ్చే దరఖాస్తును అమ్మవారి ఎదుట ఉంచి ఆశీర్వాదాలు కోరారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ టికెట్ (మిగతా 6లో)



ర్యాలీగా దుర్గమ్మగుడికి వెళ్తున్న బుద్దా వెంకన్న

నాలుగు సీట్లపై వీడని ఉత్కంఠ

- మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, తూర్పుపై తేల్చని వైసిపి అధిష్టానం
- మళ్లీ వసంత అలక
- తాజాగా తెరపైకి ఎంఎల్‌సి తలశిల పేరు?

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

సీట్ల ఖరారు అంశంలో అధికార వైసిపిలో ఉత్కంఠ నెలకొంది. ఎన్‌టిఆర్ జిల్లాలో ఇంకా అధిష్టానం ప్రకటించకుండా ఉన్న మరో నాలుగు స్థానాలను ఎవరికి కేటాయిస్తారోరని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల బెర్తులు ఎవరికి దక్కనున్నాయనే దానిపై ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదల చేసిన ఐదు జాబితాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టిర్ జిల్లాకు సంబంధించి తిరువూరుకు నల్లగట్ల స్వామిదాసును, విజయవాడ పశ్చిమంనకు షేక్ ఆసిఫ్‌ను, విజయవాడ సెంట్రల్‌కు వెలంపల్లి శ్రీనివాస్‌ను ఇన్చార్జులుగా నియమించిన విషయం తెలిసిందే. ఇంకా నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇటీవల మైలవరం స్థానాన్ని పెడనకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి జోగి రమేష్‌కు కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. అప్పట్లో మంత్రి జోగి రమేష్, ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు, గ్రూపు తగాదాలు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకున్నా సర్దుమణగకపోవడంతో చివరికి ఆ పంచాయతీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వద్దకు చేరింది. ఇరువైపుల వారిని సముదాయించి గ్రూపు గొడవలను పక్కన పెట్టి నియోజకవర్గంలో పని చేసుకోవాలని వసంతకు సిఎం సూచించడంతో ఆయన సైలెంట్ (మిగతా 6లో)

పలుచోట్ల మధ్యాహ్న భోజన కార్మికుల నిరసనలు



ఇబ్రహీంపట్నం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు, మెనూ ఛార్జి బడ్జెట్ పెంచాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సిహెచ్ సుప్రజ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఎంఈఓ ఆఫీసు వద్ద గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్స్‌కి ప్రమాదం భీమా సౌకర్యం కల్పించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జి రూ.20 ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రెండు జతలు యూనిఫామ్, 12 నెలల వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సిఐటియు మండల కార్యదర్శి యం.మహేష్. యూనియన్ మండల అధ్యక్షురాలు కే రాజేశ్వరి కార్యదర్శి బి మంగమ్మ, ఉపాధ్యక్షులు ఎస్ రమణ, కమిటీ సభ్యులు రజిని, లక్ష్మీ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మైలవరం

నందిగామ: నందిగామ మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం నందిగామ విద్యాశాఖ అధికారి పద్మావతికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం అమలు చేయాలన్నారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి వి.ఏసోబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్, మధ్యాహ్నం భోజనం నందిగామ మండల కార్యదర్శి ఆదూరు సుశీల, కోయల నాగేంద్ర, తాటి తులసమ్మ, షేక్ మస్తాన్ బి, జి.పుల్లమ్మ, నాగమలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల విద్యాశాఖ అధికారి ఎల్ బాలుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికుల పని చేస్తున్నారని, సకాలంలో బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి శేషమ్మ, నారాయణమ్మ, సంపత్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ



ఘనంగా తిరుపతమ్మ రంగుల మహోత్సవం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ముందుగా ఉదయం 6 గంటలకు ఆలయంలోని శ్రీ గోపయ్య సమేత



శ్రీ తిరుపతమ్మ అమ్మవారుతో పాటు సహా దేవతామూర్తులను ప్రధాన మండపం వద్దకు తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి విమలభాను, కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె రమేష్ నాయుడు, సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, ఛైర్మన్ శ్రీనివాసరావు ధర్మకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రజకులు వారి శిరస్సులపై అమ్మవారిని స్వామివారిని సహా దేవతామూర్తులను ఉంచుకుని మేళా తాళాలతో, వివిధ రకాల వేషధారణలు, అటవీ కోమ్ముల వారి కోలాటాల మధ్య భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుండి ప్రధాన రహదారి గుండా స్టేషన్ సెంటర్‌కు ఊరేగింపు చేరుకోగా సిఐ జానకిరామ్, ఎస్ఐ దుర్గాప్రసాద్ అమ్మవారికి స్వామివారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. సత్రం సెంటర్, లగడపాటి వారి బజార్ మీదుగా అమ్మవారు రంగుల మండపం వద్దకు మధ్యాహ్ననికి చేరుకున్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. దేవతామూర్తులను జగ్గయ్యపేట తరలించేందుకు ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల అలంకరణలకు ఉదయభాను అల్లుడు నరసింహారెడ్డి రూ.2 లక్షలు విరాళం అందజేశారు.

న్యాయవాదుల దీక్షకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022 రద్దు చేయాలని బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న న్యాయవాదులకు సిపిఎం నేతలు సంపూర్ణ మద్దతు తెలిపి దీక్షల్లో కూర్చున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, బోయి సత్యబాబు పాల్గొన్నారు. భూ హక్కు చట్టం-2022ను రద్దు చేయాలని, నాయవాదుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నాయకులు నినాదాలు చేశారు. బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, న్యాయవాదులకు నష్టదాయకమైన రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టం-2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. భూ కబ్జాలు చేసుకునేందుకు బడా కంపెనీలకు వీలైన రీతిలో ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. ఇప్పటి వరకు ఎవరైతే ప్రజల భూములకు హక్కులు కల్పించకుండా హక్కులు కాలరాస్తున్నారో వాళ్ళకే జుడిషియల్ అధికారాలు ఇచ్చి దొంగచేతికే తాళాలు ఇచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. భూ యజమానులు సమస్యలపై న్యాయస్థానాలకు వెళ్ళే అవకాశం లేకుండా హైకోర్టు స్థాయి వరకు కోర్టులకు వెళ్లకుండా చేయడం అంటే సామాన్యులకు న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూపతి రమణారావు, పి.కృష్ణ, నటరాజు పాల్గొన్నారు.



హాస్య నాటికల పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నిత్యజీవితంలో ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించి ఆనందాన్ని కలిగించే హాస్యనాటికలను ప్రోత్సహించాలని బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండల రావు అన్నారు. గురువారం సాయంత్రం సుమధుర కళా నికేతన్‌లి 50వ వార్షికోత్సవం మరియు 26వ లితెలుగు హాస్య నాటికలు పోటీలులి మొగల్ రాజ్ పురం లోని సిద్ధార్ధ కళాశాల ఆడిటోరియంలో ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి గా విచ్చేసిన కొండలరావు ప్రసంగం కొనసాగిస్తూ సినీ, టివీ రంగాలకు ఆకర్షితులై నాటకరంగాన్ని విస్మరించకూడదు అన్నారు. గౌరవ అతిధి సిద్ధార్ధ కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎన్ లలిత ప్రసాద్ దప్రసంగిస్తూ యువతరాన్ని సాంస్కృతిక రంగం పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. పలు బంగారు నందులు గ్రహీత, నటుడు పి వి ఎన్ కష్ణ ప్రసంగిస్తూ నాటక ప్రదర్శన పట్ల కళాకారుడి కషి వి గుర్తించి గౌరవించాలని అన్నారు. స్కూల్ ఆఫ్ పెర్ ఫార్మింగ్, ఫైన్ ఆర్ట్స్ డీన్ డాక్టర్ జి అనిత, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, టి కృష్ణ నాగార్జున కళా పరిషత్(కొండపల్లి) అధ్యక్షులు దేవినేని కిషోర్ కుమార్, సుమధుర అధ్యక్షులు సామంతపూడి నరసరాజు అధ్యక్షత వహించి పరిషత్ నిర్వహణ లో ఎదుర్కొంటున్న విషయాలు వివరించి, నాలుగు రోజుల నాటిక పోటీలను విజయవంతం చేయాలన్నారు. సుమధుర గౌరవాధ్యక్షులు డాక్టర్ యం సి దాస్ జీవితంలో హాస్య ప్రాధాన్యత వివరించారు. సుమధుర ఛైర్మన్ డాక్టర్ ఎన్ మురళీకష్ణ ఆహ్వానం పలికారు. రంగస్థల నటి గుడివాడ లోహరి కి రావి కొండలరావు, రాధాకుమారి స్మారక పురస్కారంతో సత్కరించారు. నంది అవార్డు గ్రహీతలు సత్కరించారు. అనంతరం పోటీల్లో తొలి నాటికగా శ్రీకృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గుడివాడ వారు పెద్దిబోయిన కృష్ణ హితేష్ రచన, దర్శకత్వంలో 'నాన్నా నేనే గెలిచా' నాటిక ప్రదర్శనతో హాస్యాన్ని పండించారు. రెండో నాటికగా డాక్టర్ పి బ్రహ్మానందరావు రచనను, కత్తి శ్యాం ప్రసాద్ దర్శకత్వంలో 'ట్రీట్మెంట్' హాస్యయుతంగా ప్రదర్శించారు. కార్యక్రమాన్ని సుమధుర కార్యదర్శి పి వి భాస్కరశర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షించారు. డాక్టర్ డి కైలాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.




రేపటి కార్యక్రమం:

ఉదయం 10.30కి 'కళారంగం-యువ కళాకారుల పాత్రపై' సెమినార్. ఆచార్య నాగార్జున యూనివర్సిటి, సుమధుర సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6కి చూపులు కలవని శుభవేళ, రంగు పడుద్ది, ఏడున్నాడో ఎక్కడున్నాడో నాటికల ప్రదర్శన.

మున్సిపల్ ఛైర్మన్ వరలక్ష్మికి నివాళి

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ పట్టణ శివారు లక్ష్మీపురంలో మున్సిపల్ ఛైర్మన్ మండవ వరలక్ష్మి సంస్మరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టిడిపి పార్లమెంట్ ఇన్చార్జి కేశినేని చిన్ని, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తంబళ్లపల్లి రమాదేవి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మండవ పిచ్చయ్య, మండల భవాని శంకర్, మండవ వెంకట నరసయ్య, మండవ శ్రీను, పారుపల్లి మురళి పాల్గొన్నారు.



నూతన ఎంపిడిఓలు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-మైలవరం: మైలవరం ఎంపీడీవోగా పి.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మైలవరంలో పనిచేసిన లక్ష్మీకుమారి బదిలీ కాగా ఆమె స్థానంలో వెస్ట్ గోదావరి జిల్లా పోలవరం నుండి శ్రీనివాస్ మైలవరం వచ్చారు.




ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా పి.ఉమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.వి.రామకృష్ణ నాయక్ పల్నాడు మండల ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. అమరావతి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఉమాదేవి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



అజిత్ సింగ్‌నగర్: విజయవాడ రూరల్ మండల ఎంపీడీవోగా అద్దంకి శ్రీ రమ్య బాధ్యతలు స్వీకరించారు.



కంచికచర్ల: కంచికచర్ల ఎంపిడిఓగా ఎన్ వెంకటేశ్వరరావు స్థానిక మండల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపిడివోగా పనిచేస్తున్న ఆయన కంచికచర్లకు బదిలీ పై వచ్చారు. ఇక్కడ ఎంపిడిఓగా పనిచేస్తున్న కె శిల్ప గుంటూరు జిల్లా తెనాలికి బదిలీ అయ్యారు.



నందిగామ: నందిగామ మండల పరిషత్ అభివద్ధి అధికారిగా ఎం విశ్వనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నుండి బదిలీపై నందిగామ వచ్చారు.

డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నందిగామ

మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ప్రతిపాదనని మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి ఊరిస్తూ కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను దష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ నాటికి జూన్ వరకు రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులు భర్తీ అనడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు.

చెత్త డంపింగ్‌కు స్థలం కేటాయించాలి : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పంచాయతీలో చెత్త డంపింగ్ చేయడానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సిపిఎం గన్నవరం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం గన్నవరంలో పార్టీ నాయకులు మిరప నాగేశ్వరరావు గుండెమెడ ఉదయభాస్కరరావు, సూరగాని సాంబశివరావు విలేకరులతో మాట్లా డారు. గన్నవరం పంచాయతీలో 25 వేల జనాభా ఉన్నారని, రోజుకో 10 నుంచి 15 ట్రాక్టర్ల చెత్త వస్తుందని చెప్పారు. చెత్త పోయడానికి స్థలం లేకపోవడంతో గత నెల రోజులుగా చెత్తను సక్రమంగా సేకరించడం లేదని తెలిపారు. రోడ్ల వెంట చెత్త పోసి తగలబెడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఈ క్రమంలో ఒక కాలుష్యం, చెత్త నుంచి దుర్వాసన రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గొల్లనపల్లి ఏరియాలో ఆర్ఎస్ నెంబర్ 88లో 2.50 ఎకరాలు ప్రభుత్వ భూమిని చెత్త డంపింగ్ కేటాయిస్తూ గతంలో కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారులు స్థలం ఇంతవరకు చూపించలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య పెరిగిపోయిందని, చెత్త నుంచి వచ్చే రోగాలతో జనం బాధలు పడుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థలం కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే స్థానికులతో కలిసి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. చెత్త సేకరణ నిలుపుదలపై పంచాయతీ అధికారులను అడిగితే తాము ఏమీ చేయలేమని చేతులెత్తేసినట్లు తెలిపారు. ఐదు కోట్ల రూపాయల ఆదాయం ఉన్న పంచాయతీలో చెత్త డంపింగ్ స్థలం పెద్ద సమస్యగా మారడం విడ్డూరంగా ఉందన్నారు.


సాయం అందిస్తున్న బండి రామకృష్ణ

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : జనసేన, తెలుగుదేశం నాయకుల ఆత్మీయ సమావేశం బందరు మండలం పెదపట్నం గ్రామంలో ఇన్చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, క్రికెట్ కొరకు గ్రౌండ్ ఏర్పాటు చేయాలని శిథిలావస్థలో ఉన్న చర్చి గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు.జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను రానున్న ఉమ్మడి ప్రభుత్వంలో సమసి పోతాయని పెదపట్నాన్ని అభివద్ధి పరుస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఇరువురు విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కరికి 5000 చొప్పున ఇరువురికి 10,000 వేల రూపాయలు ఆర్థిక సాయం జన సైనికుల సహకారంతో బండి రామకష్ణ అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపి నాయకులు గడ్డాడ ప్రకాష్, దాసి యుగంధర్, కాకర కాంతరావు, బసవ ఏడుకొండలు, గరికిముక్కు ప్రసాద్, మండపాటిఅజయ్, యర్రంశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు వంశీ పరామర్శ


కాజ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న వంశీ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :బాపులపాడు మండలంలోని పలువురిని ఎమ్మెల్యే వంశీ గురువారం పరామర్శించారు. కాకులపాడు గ్రామ సర్పంచ్ కాజ ప్రసాద్ తండ్రి దసుమంతరావు బుధవారం మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే వంశీ పూలమాలవేసి నివాళులర్పించారు.వీరవల్లి టీడీపీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహనబెనర్జీ సతీమణి జానకిరత్నం ఇటీవల మరణించడంతో ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రాయి గోపాలకష్ణ తండ్రి సత్యనారాయణ మృతిచెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామన్నగూడెం గ్రామంలోని గ్రామ వైసీపీ అధ్యక్షుడు నగలం సత్యనారాయణ తల్లి లక్ష్మీ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వైసీపీ గ్రామ అధ్యక్షుడు నల్లిబోయిన శ్రీహరి తండ్రి పిఏసిఎస్ అధ్యక్షుడు నల్లిబోయిన జయరాం ఇటీవల మతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏపీ ఆర్ డి సి సి చైర్మన్ కనుమూరి రాజబాబు, వైసిపి మండల కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ ఎర్రగొర్ల నగేష్, సూరపనేని రాధా కష్ణమూర్తి, అధ్యక్షులు మూల్పురి ప్రభుకాంత్,దయాల విజయ నాయుడు, అల్లాడి థెరిసా, కష్ణాజిల్లా వైసీపీ యువజన విభాగం ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి రామాంజనేయులు, కోమరవల్లి కిరణ్ మూర్తి గూడవల్లి రత్న సుధాకర్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను పేదలకు పంచాలి



ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆక్రమణలో ఉన్న అసైన్ భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి పి. పవన్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మచిలీపట్నం నియోజకవర్గం 11 గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలిన 12,311. 21 సెంట్లు భూమిలో 9,729.29 సెంట్లు భూమి 5,851 మంది ఆక్రమణదారుల చేతిలో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి ప్రకటించిందనానరు. అయితే గుర్తించిన భూమిలో సుమారు 80 శాతం భూమి ఆక్రమణదారుల చేతిలో ఉన్నట్టు తేలిందని, ఒక్క మచిలీపట్నం నియోజకవర్గం లోని పెద్ద ఎత్తున ఇంత భూమి ఆక్రమణ జరిగిందంటే జిల్లాలో ఉన్న అసైన్డ్ భూముల్లో లక్షల ఎకరాలను ఆక్రమణదారులు చేతుల్లో ఉన్నట్లు అర్థమ వుతుందన్నారు. కావున ప్రభుత్వం ఆక్రమణదారుల చేతిలో గుర్తించిన భూమిలో ప్రస్తుతం అనుభవ దారులుగా ఉన్న వారిలో భూమిలేని పేదలుగా ఉన్న వారిని అర్హులుగా గుర్తించి వారికే ఆ భూమిని అసైన్డ్ చేయాలన్నారు.

'భవిష్యత్ ష్యూరిటీ' కరపత్రాలు పంపిణీ


గుడ్లవల్లేరు మండలంలో పర్యటిస్తున్న వెనిగండ్ల రాము


ఉయ్యూరు మండలంలో పర్యటిస్తున్న బోడే ప్రసాద్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రధాన సెంటర్ లో రాముకు టిడిపి ,జనసేన పార్టీల శ్రేణులు, ప్రజానీకం ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటు, టిడిపి జనసేన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వెనిగండ్ల రాము వివరించారు. అనంతరం నక్కవారిపాలెం, గాదేపూడి, ఉలవపూడి గ్రామాల్లో ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ శాయన పుష్పవతి, మండల టిడిపి అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, తూము పద్మజ,జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారి, టిడిపి నాయకులు జంగం మోహన్ రావు , వడ్లమన్నాడు టిడిపి అధ్యక్షుడు పెన్నేరు రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఉయ్యూరు : ఆకాశానంటుతున్న నిత్యావసరాల ధరలు, పెంచిన విద్యుత్, బస్సుచార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలు మోయలేని భారంతో అల్లాడుతుంటే ప్రభుత్వానికి, అధికారపార్టీ నా యకులు పట్టనట్ట వ్యవహరించడం హేయమని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బోడెప్రసాద్ అరోపించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం లో భాగంగా స్థానిక సాయిమహల్ సెంటర్, 3వ వార్డులో గురువారం పర్యటించి ప్ర జల సమస్యలు తెలుసుకున్నారు. మా జీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు కూనపరెడ్డి వాసు, జ ంపన శ్రీనివాస్, జగరోతు నాగరాజు, అప్పలనాయుడు, అంజిబాబు, పైడయ్య పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి-పెడన : భవన నిర్మాణ కార్మికులకు జనసేన పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని నియోజకవర్గ జనసేన నాయకులు ఎస్‌వి బాబు అన్నారు. గత నెల 26వ తేదీన ఓఎన్జిసి భవన నిర్మాణంలో సెంట్రింగ్ కూలి గాయపడిన నియోజవర్గ పరిధిలోని మండలం చిన్న పాండ్రకకు చెందిన భవనిర్మాణ కార్మికులైన పులి గంగరాజు, పెద్ది సుబ్రమణ్యం, నగేష్‌లను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక రంగంలోని అన్ని చేతివత్తుల వారికి తమ పార్టీ ఎప్పుడు కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కునసాని నాగబాబు, బంటుమిల్లి మండల అధ్యక్షులు గోట్రు రవికిరణ్, మండల ప్రధాన కార్యదర్శులు తిరుమణి ఆంజనేయులు, పినిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న ఎస్వీ బాబు



కొండరాళ్ల లారీ బోల్తా

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం తరకటూరు ఎన్ హెచ్ 65 వద్ద గురువారం లోడ్ లారీ బోల్తా కొట్టింది. మచిలీపట్నం పోర్ట్ వద్దకు కొందరాళ్లను తరలిస్తున్న టిప్పర్ లారీ పల్టీ కొట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.సంఘటనా స్థలానికి పెడన సిఐ హాబీబ్ బాషా, గూడూరు ఎస్సై శేషు కుమార్ చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గత పది రోజులుగా గూడూరు పరిసరాల్లో టిప్పర్ లారీ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇటీవల పది గేదెలను టిప్పర్ లారీ ఢీ కోట్టడంతో మత్యువాత పడ్డాయని, పరిమితికి మించి లోడుచేయడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

ట్రాక్టర్ బోల్తా


బోల్తా కొట్టిన ట్రాక్టర్

ప్రజాశక్తి-చల్లపల్లి : నిత్యం రద్దీగా ఉండే చల్లపల్లి -నడకుదురు రోడ్డు గోతులమయం కావడంతో తరచుగా ప్రమాదాలు జరుగు తున్నాయి. మేకా వారిపాలెం సమీపంలో ఇటీవల ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటన మరువకముందే నడకుదురు రోడ్డులో చెరకు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. గురువారం నడకుదురు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై ఉన్న భారీ గోతుల్లో అదుపు తప్పి ట్రక్కుపక్కకు బోదులోకి ఒరిగిపోయింది. నడకుదురు నుంచి చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో ఉన్న కెసిపి షుగర్స్ చెరుకు ఫ్యాక్టరీ డంపింగ్ యార్డ్‌కు చెరకు తరలిస్తున్న ట్రాక్టర్ ఈ ప్రమాదానికి గురైంది. అదష్టవశాత్తు పక్కన ఇతర ద్విచక్ర వాహనదారులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చల్లపల్లి - నడకుదురు ప్రధాన రహదారిపై చల్లపల్లి వద్ద ఏర్పడి ఉన్న అత్యంత భారీ, ప్రమాదకర గోతుల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గోతులు పూడ్చాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.


మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

కొమ్మమూరులో 'జయహో బిసి'

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : బీసీల బతుకుల్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బుగ్గి చేశారని పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని కొమ్మమూరు గ్రామంలో గురువారం మండల బీసీ నాయకులు వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వర్యంలో జయహో బీసీ గర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో బీసీలకు జగన్ రెడ్డి చేసిన మేలేమీ లేకపోయినా.. వారి హక్కుల్ని, అధికారాల్ని లాక్కుని వారి జీవితాలను నాశనం చేశాడని మండిపడ్డారు. కొనకళ్ల నారాయణరావు, బచ్చుల బోసు ,నూకాలమ్మ యాదవ్,మాజీ లంకే నారాయణ ప్రసాద్,మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు రామనేని కుటుంబయ, మచిలీపట్నం మాజీ కౌన్సిలర్ బత్తిన దాస్, బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్, రాష్ట్ర సగర సాధికార సమితి అధ్యక్షులు జంపాన శ్రీనివాసరావు, మండల బిసి అధ్యక్షులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలంపల్లి పర్యటన

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: వైసిపి సెంట్రల్ నియోజవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు గురువారం నియోజకవర్గంలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నవరత్నాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీతారాంపురంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, ఎమ్మెల్సీ రుహల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని వేమవరం-పెనుగంచిప్రోలు వరకు మూడు కిలోమీటర్ల మేర 1.5 కోట్ల రూపాయలతో నూతనంగా



నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 14 కోట్ల రూపాయలతో ఫోర్ లైన్ రోడ్డు చేపట్టడం జరిగిందన్నారు. మరో కోటి రూపాయలు కేటాయించి సెంటర్ డివైడింగ్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా రెండు కోట్ల రూపాయలతో షేర్ మహమ్మద్ పేట - గంద్రాయి వరకు ఐదు కిలోమీటర్ల మేర నూతన రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని మరి కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

శతాధిక వృద్ధురాలు గురవమ్మ మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: చిల్లకల్లు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బత్తుల గురవమ్మ (125) గురువారం మృతిచెందారు. ఆమెకు నలుగురు కుమారులు, 8 మంది కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లతో కలిపి మొత్తం 180 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. గురవమ్మ మరణ వార్త తెలుసుకున్న ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్ చిల్లకల్లు గ్రామంలో వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రావూరి విశ్వనాథం, తాళ్లూరి వెంకటేశ్వర్లు, రావూరి శ్రీనివాసరావు, డేవిడ్, జ్వాలాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

ప్రజాశక్తి-తిరువూరు: ఎపి భూమి యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ముందు న్యాయవాదులు చేస్తు న్న రిలే నిరాహార దీక్ష గురువారం కూడా కొనసాగింది. ఎం.సత్యం, ఎన్.సుబ్బారావు, మేకల రవి, జి. భాస్కరరావు, పల్లెపాటి చరణ్ దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలోబార్ అసోసియేషన్ అధ్యక్షులు సంకురాత్రి జనార్ధన్‌రావు, మోదుగుముడి శ్రీనివాసరావు, చింతల వెంకటరెడ్డి, మేకల నాగేంద్రప్రసాద్, రాజవరపు శ్రీనివా సరావు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, దారా మాధవ్, అత్తులూరి శ్రీనివాసరావు, ప్రభాకర్ రెడ్డి, బి గణేష్ సింగ్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు కళాశాలలో వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్), ఆధ్వర్యంలో ఐ.ఎస్.ఎఫ్. ఐఈటిఈ స్టూడెంట్స్ డే సెలబ్రేషన్స్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఐఎస్ఎఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ సహకారంతో ఐఈటిఈ స్టూడెంట్స్ డే-2024 ప్లాటినం సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ గురువారం కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఐఈటిఈ విజయవాడ సెంటర్ చైర్మన్ బి. రాజశేఖర్ మాట్లాడుతూ ఐ.ఎస్.ఎఫ్ యొక్క లక్ష్యాల గురించి వివరించారు. ఐ.ఈ.టి.ఈ. విజయవాడ సెంటర్ సెక్రటరీ డాక్టర్ సుజిత్ కల్లూరి మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న సాంకేతిక అంశాలలో ఆలోచనలు మార్పిడికి, ఉమ్మడి వేదికను అందించడం ఐ.ఎస్.ఎఫ్. యొక్క ఉద్దేశమని తెలిపారు., ట్రెజరర్ డాక్టర్ బి. సూర్య ప్రసాదరావు మాట్లాడుతూ ఐ.ఈ.టీ.ఈ సభ్యత్వం యొక్క ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి. లక్ష్మణ స్వామి, ప్రిన్సిపల్ డా. జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డా. ఏ. పతాంజలి శాస్త్రి,, ఈ.సీ.ఈ విభాగాధిపతి ఏవి, కిరణ్మయి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సామా మణికంఠ, ఐ.ఈ.టి.ఈ కోఆర్డినేటర్ టి. శిఖామణి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓట్ ఫర్ ఓపిఎస్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని ఎవరైతే హామి ఇస్తారో వారికి మాత్రమే రానన్న ఎన్నికలలో ఓటు ఉంటుందని తెలియచేసే విధంగా 'ఓట్ ఫర్ ఓపియస్' పేరుతో రూపొందించిన పోస్టర్లను యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ధర్నా చౌక్ వద్ద ఆవిష్కరించారు. ఈసందర్భంగా యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.సుందరయ్య మాట్లాడుతూ ఎవరైతే పాతపెన్షన్ పునరుద్ధరణ చేస్తారని హామీ ఇస్తారో వారికి మాత్రమే ఏప్రియల్‌లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మా ఉద్యోగుల ఓటు ఉంటుందని అన్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో వామపక్షాలు సిపిఎం, సిపిఐ పార్టీలు పాత పెన్షన్ అమలుకు కట్టుబడి ఉన్నాయన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కూడా పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని చెప్పి హామీ ఇచ్చారని అన్నారు. ఇతర రాజకీయ పార్టీలు కూడా పాత పెన్షన్ విషయంలో వారి వైఖరి స్పష్టం చేయాలని, మేనిఫెస్టోలో అమలు చేస్తామని హామి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ 2019లో వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ చేస్తామని హామి ఇచ్చినా గాని సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్ పేరుతో వేరే స్కీమ్ తీసుకువచ్చి ఉద్యోగులను మోసం చేసిన పరిస్థితి వచ్చిందన్నారు. ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదాన్ని ఉద్యోగుల్లోకి, ఉపాధ్యాయులకు, ప్రజల్లోకి అన్ని రాజకీయ పార్టీల మండల జిల్లా, రాష్ట్ర నాయకులు దృష్టికి తీసుకువెళ్లే విధంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు మచ్చా శ్రీనివాస్, కార్యదర్శి ఎ.అనంతకుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎల్.చంటి, మండల నాయకులు యస్. విజయలక్ష్మి,



ఏ.మంగమ్మ, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విస్సన్నపేట: సిపిఎస్ విధానం రద్దు చేసి ఓ పిఎస్ విధానం అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సంఘం రూపొందించిన మన ఓటు - మన భవిష్యత్ పోస్టర్‌ను యుటిఎఫ్ విస్సన్నపేట ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్ష ,కార్యదర్శులు కే చైతన్య, డి వెంకట్రామయ్య, నాయకులు వి రవి, సిహెచ్ లక్ష్మయ్య, ఏ మురళి, కే రంగా, వెంకటేశ్వరరావు, వై సువర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం : సిఐ



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న సిఐలు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : వన్‌టౌన్‌లోని అసాంఘిక శక్తులకు అవకాశం లేకుండా వారి ఆట కట్టించటమే లక్ష్యమని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ దుర్గా శేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి సిఐ విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమ రవాణా, నిషేధిత పొగాకు, గంజాయి వంటి విక్రయాలకు మరియు గంజాయి త్రాగే వారికీ, బ్లేడ్ బ్యాచ్ వారికీ అడ్డుకట్ట వేసేందుకు విజయవాడ వన్‌టౌన్ పోలీసులు విస్తత సోదాలు చేపట్టారు, సీఐ డి..దుర్గా శేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సామారంగం చౌక్, మెయిన్ బజార్, రమణయ్య కూల్ డ్రింక్ షాపు సెంటరు, తారాపేట, రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ వైపు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ.దుర్గా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. అలాగే స్థానిక ప్రజలతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. త్వరలో జరగబోవు జనరల్ ఎలక్షన్స్‌కు సంబంధించి వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలో ఉన్న ఎలక్షన్ పోలింగ్ బూత్‌లను వన్‌టౌన్ సిఐ డి.దుర్గా శేఖర్ రెడ్డి, టూటౌన్ సిఐ గణేష్‌లు సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్సై వి..రమ్య శ్రీ సత్య పాల్గొన్నారు.

మంచినీటి ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురంలోని 42వ డివిజన్ హెచ్ కాలనీ 450, 300 ఎస్ఎఫ్‌టి బ్లాక్‌లలో గత వారం రోజుల నుంచి త్రాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి మంచినీరు సరఫరా చేయాలని ఆ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించి స్థానిక మహిళల నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక మహిళలు మంచినీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార వైసీపీ మాత్రం చోద్యం చూస్తున్నారని ఆమె విమర్శించారు.

రూ.23 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక 44వ డివిజన్‌లోని లేబర్ కాలనీలో రూ. 23 లక్షల నిర్మాణ వ్యయంతో రెండు చోట్ల డ్రెయిన్లను నిర్మించనున్నట్లు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి చెప్పారు. గురువారం లేబర్ కాలనీలోని రెండు ప్రాంతాల్లో ఒకచోట ఏడు లక్షలు రూపాయలు, మరోచోట రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు డ్రైన్లకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ కాలనీలోని ఆరు బిల్డింగుల వద్ద నుంచి మున్సిపల్ హైస్కూల్ మీదగా ,మెయిన్ రోడ్డు వరకు ఈ రెండు డ్రైనులను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, కాలనీ ప్రెసిడెంట్ ఋషి, వైసీపీ నాయకులు వీరజాల మధు లీల, అంకాన నాగరాజు, వల్లం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-తిరువూరు: పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని తిరువూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు తాపీ పనులు నిలిపివేసి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న తిరువూరు లేబర్ అధికారిని నియ మించాలని, పనులు జరిగేటప్పుడు ప్రమాదవశాత్తు కార్మికుడు కింద పడితే ప్రమాద బీమా కింద ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నిధులు రూ.1260 కోట్లను ఇతర అవసరాలకు వాడుతుందని సిఐటియు మండల కార్యదర్శి బి.వెంక టేశ్వరావు, సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం విమర్శించారు. మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్



అధ్యక్షులు నల్లగొర్ల బద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మౌలాలి, షేక్ రసూల్, పింగళి నాగరాజు, ఏనుగు వెంకటేశ్వరావు, నల్లగొర్ల ప్రసాదు, సిహెచ్. వెంకటేశ్వరరావు, గద్దల గోపి, హరికృష్ణ, కొంగల నాగేశ్వరావు, గజ్జెల్లి అనిల్, గోగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని బూదవాడ గ్రామంలో రూ.1.03 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ విగ్రహం, గోదాం తదితర అభివద్ధి ప్రారంభ కార్యక్రమాలను బుధవారం రాత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బూదవాడ గ్రామంలో 36 కోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామన్నారు.



కుల, మత, ప్రాంత పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 25వ వార్డు క్రిస్టియన్ పేటలో గురువారం సామినేని ఉదయభాను గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. అనంతరం క్రిస్టియన్‌పేట వాసులు పలు సమస్యలు తెలపగా అక్కడే అధికారులతో మాట్లాడి సమస్యను మరి కొద్ది రోజుల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న



ఇల్లు స్థలాలు, గృహాలు ఉన్న వాటికి పట్టాల విషయంలో తహసిల్దార్ కార్యాలయంలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గత కొంతకాలంగా జగ్గయ్యపేట పట్టణం, మండలంలోని ప్రజల సంక్షేమం కోసం అనేక ఇల్లు, ఇళ్ల స్థలాల కోసం పట్టాలు మంజూరులో కొన్నిచోట్ల సాంకేతిక కారణాలతో సమస్యలు ఏర్పడ్డాయని అందుకోసం దీర్ఘకాలికంగా జాప్యం జరుగుతూ వస్తుందని, వేగంగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

'ఆసరా' నిధులను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి



ఉయ్యూరులో చెక్కు అందిస్తున్న మంత్రి జోగి రమేష్



అవనిగడ్డలో చెక్కు అందిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి ఉయ్యూరు : రాష్ట్రంలోని మహిళలకు అండగా నిలుస్తూ, వారిని ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆసరా నిధులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు మండలం ఆకునూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నాలుగో విడత వైయస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని అందించారు. ఉయ్యూరు మండలంలో 768 స్వయం సహాయక సంఘాలలో 7, 577 మంది సభ్యులు ఉంటే వీరికి 25 కోట్ల 40 లక్షల 11 వేల 746 రూపాయలు నిధులు జమఅయ్యాయి. ఉయ్యూరు మండల ఎంపీపీ చీలి కల్యన, వైస్ ఎంపీపీ గంజి స్వర్ణ కుమారి, చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివద్ది కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, పాకునూరు గ్రామ పంచాయతీ ఇంచార్జ్ గారపాటి నాని పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైయస్ జగన్ : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. గురువారం నాలుగో విడత ఆసరా పథకం సంబరాల కార్యక్రమం టీటీడీ కల్యాణ మండపంలో వెలుగు వైయస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని 7635 మంది డ్వాక్రా గ్రూప్ సభ్యులకు రూ 9.35 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కష్ణా గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ,ఎంపీడీవో ఎం మరియా దేవి, తాసిల్దార్ ఎల్ వి ఎస్ రామకష్ణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ పిఏసిఎస్ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్ పాల్గొన్నారు.

గన్నవరం కాంగ్రెస్ అభ్యర్థిగా గుర్రం నాని పోటీ ?



ప్రజాశక్తి.. గన్నవరం : రానున్న ఎన్నికల్లో గన్నవరం నియోజక వర్గంలో నుంచి పోటీ చేయడానికి ప్రముఖ రియల్టర్, బిల్డర్ గుర్రం నాని రంగంలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లుగా సమాచారం. రాష్ట్రంలో పిసిసి పగ్గాలను వైయస్ షర్మిల చేపట్టిన తర్వాత యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కాంగ్రెస్ కుటుంబానికి చెందిన వారు పార్టీలోకి రావాలని ఆహ్వానం పలుకుతున్నారు. అందులో భాగంగానే గన్నవరం నియోజకవర్గంలోని అల్లాపురం గ్రామానికి చెందిన నానికి పిలుపు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఆయన రంగంలోకి దిగుతారా? లేదా అన్నది కొద్ది రోజుల్లో తెలుస్తుంది. ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్నికల బరిలో ఉంటారు. యువకులకు ప్రాధాన్యత ఇస్తే.. బాగుంటుందని కాంగ్రెస్ అభిమానులు భావిస్తున్నారు. వైసిపి టిడిపి నుంచి ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు రంగంలో ఉంటారు. అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని రంగంలోకి దింపాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. గుర్రం నాని అదే సామాజిక వర్గానికి చెందిన యువకుడు కావడంతో బరిలోకి దిగుతారని పలువురు అంటున్నారు.

ఈవీఎంలపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక పెద్దఎరుకపాడు ,మంద పాడులో గురువారం ఓటింగ్ మిషన్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదసులో ముఖ్య అతిథిగా పాల్గొన్న టూటౌన్ సి.ఐ దుర్గరావు పాల్గొన్ని మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న దష్ట్యా ప్రతి ఒక్కరూ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివా లయం సిబ్బంది, పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే 'లయన్స్' లక్ష్యం



కృత్రిమ కాళ్లు అందిస్తున్న దృశ్యం

పెనమలూరు : ప్రపంచ స్థాయిలో నిరు పేదలకు, దివ్యాంగులకు సహాయం అందించడమే లయన్స్ ఇంటర్నేషనల్ లక్ష్యమని లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ లయన్. జె. ఫ్రాంక్ మూర్ (అమెరికా) అన్నారు. పోరంకిలో స్థానిక చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లయన్స్ మల్టి సర్వీస్ సెంటర్ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి సేవా మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ లయన్. జె. ఎన్. శంకర్ గుప్తా మాట్లాడుతూ ఈ మహోత్సవంలో 32 మంది దివ్యాంగులకు కత్రిమ కాళ్ళను, 73 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు, 72 మంది పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సైకిళ్ళు, 47 మంది పేద మహిళలకు వెట్ గ్రైండర్లు, 9 మంది వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, 10 మంది బధిరులకు వినికిడి మిషన్లు, మొత్తం 243 లబ్ధిదారులకు 25 లక్షల విలువ గల పరికరాలు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ లయన్ చిగురుపాటి వరప్రసాద్, లయన్. వంకా రవీంద్రనాథ్, నేత్రజ్యోతి లయన్ టి. దుర్గా మల్లేశ్వర రావు, మహోత్సవ చైర్మన్ తేజ్ రాజ్ సోలాంకి, లయన్. మద్దినేని చక్రధర్, లయన్. కొల్లి ఎన్‌వి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అసైన్డ్ భూముల పట్టాలు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : అర్హులైన భూమిలేని నిరుపేదలకు అసైన్మెంట్ పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ వారి ఛాంబర్ నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గత ఏడాది మే 22 తేదీన మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ పనులు ప్రారంభోత్సవానికి మచిలీపట్నం వచ్చిన సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు మచిలీపట్నం మండల పరిధిలో మొత్తం 11 గ్రామాలలో (పోలాటి తిప్ప, కొత్తపల్లి తుమ్మల పాలెం, తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం, పల్లె తుమ్మలపాలెం, కోన, రుద్రవరం, గుండు పాలెం, చిన్నాపురం, వాడపాలెం) 12,311 .21 ఎకరాల భూమిలో ఎంజాయ్ మెంట్ సర్వే పూర్తి చేశామన్నారు. మొత్తం 12,311.21 ఎకరాల్లో 2193 .74 ఎకరాలు 1570 మంది ఒరిజినల్ అస్సైన్దారులు లేదా వారి వార సుల స్వాధీనంలో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఏపీ ఎస్సైన్మెంట్ ల్యాండ్స్ చట్టం 1977 అనుసరించి ఇతరుల స్వాధీనంలో గల భూములకు, ఒరిజినల్ ఎస్సైని దారులకు, ప్రస్తుతం అనుభవంలో ఉన్నవారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

ప్రజాశక్తి-చల్లపల్లి : గురుకుల బాలికలు క్రీడల్లో రాణించటం అభినం దనీయమని సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి అన్నారు. చల్లపల్లి ప్రభుత్వ ఎస్సీ బాలికల జట్టు క్రీడాకారిణిలు ఆడుదాం ఆంధ్ర అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో మూడవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం చల్లపల్లి గ్రామ పంచాయతీ వద్ద విద్యార్థినులను సర్పంచ్ సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, ప్రిన్సిపాల్ శాంతి విశాల, పీఈటీ దేవి పద్మజ, శానిటరీ అధికారి సుధాకర్, మహిళా పోలీసులు వేమూరి లావణ్య, సైకం నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని నిరసన



నిరాహార దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి కల్కరేట్ (కృష్ణా) : ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని లేదంటే పోరుబాట ఆపేది లేదని యుటి ఎఫ్,రాష్ట్ర కార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఉపాధ్యాయయులకు పెండింగ్ లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పోరుబాట కార్యాచరణ లో బాగంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కలక్టరేట్ ధర్నా చౌక్ లో ఒకరోజు నిరసన రిలే నిరాహార దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కె ఏ.ఉమ మహేశ్వర రావు మాట్లాడుతూ ఉద్యోగ , ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న సుమారు 18 వేల కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయాలని గత మూడు సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోక పోగ సమస్యను మరింత జటిలం చేస్తూ ఉద్యోగ ,ఉపాధ్యాయులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని మండి పడ్డారు. ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యా య పెన్షనర్లు వారి ఆర్థిక అవసరాల కోసం దాచుకున్న నగదును జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దారి మళ్లించి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటి కైన ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ధర్నాలో జిల్లా సహధ్యక్షురాలు జె. యూన్సీ, జిల్లా కార్యదర్శి టి. నాగేశ్వరరావు, , అబ్దుల్ హబీబ్, ఎం జోగిరాజు, వి. రవిబాబు, ఏవి వరలక్ష్మి, శ్రీ సిహెచ్ రాజా శ్రీధర్, సీనియర్ నాయకులు టీవీ రఘుకాంత్, మాజీ జిల్లా శాఖ అధ్యక్షులు పైడిపాటి రాందేవ్ పాల్గొన్నారు.



సతీష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా టి. సతీష్ గురువారం బాధ్య తలు చేపట్టారు. అనం తరం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ను మర్యాద పూర్వకంగా కలి శారు. ఇప్పటి వరకు ఉయ్యూరు ఆర్‌డిఒ రాజు, పౌర సర ఫరాల సంస్థ ఇంచార్జి జిల్లా మేనేజర్ గా వ్యవహరించారు. అలాగే జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి ఎ. అవులయ్య, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన సిహెచ్ వివిఎస్. బాపిరాజులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఎన్ఎస్ఎస్ అంటే మార్కులు కాదు మార్పు అని, దానిలో భాగస్వామ్యం అవ్వడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యం అవుతుందని మాజీ ఎన్ఎస్ఎస్ రాష్ట్ర శిక్షణా సమన్వయకర్త ఆచార్య ఎన్ఎడి పాల్ పేర్కొన్నారు. గురువారం కష్ణా విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యోప న్యాసం చేశారు. సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వాన్ని వికసింప చేసు కునే వేదిక ఎన్ఎస్ఎస్ అన్నారు. మన దేశంలో 70 శాతం మంది యువత వున్నారని, ఇది ప్రపంచంలో మరే దేశానికి లేని వరం అన్నారు. చేసే పనిలో నటన వుండకూడదని, మనకు తెలియదు అన్న సంగతి తెలుసుకున్నపుడు మంచి ఫలితాలు వస్తాయి అని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా ఎం. ప్రవాణి అధ్య క్షత జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సిఐ కార్యాలయం ప్రారంభం



సిఐ అల్లు నవీన్ నరసింహ మూర్తి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :దాతలు సహకారంతో హనుమాన్ జంక్షన్‌లో యుద్ధ ప్రాదిపదికన అధునాతనంగా నిర్మాణమైన సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ భవనం గన్నవరం ఎమ్మెల్యే వంశీ మోహన్ శు క్రవారం ప్రారంభి స్తున్నట్లు సిఐ అల్లు నవీన్ నరసింహామూర్తి తెలిపారు. జిల్లా ఎస్‌పి గా పనిచేసిన పి. జాషువా ఈ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్లు నవీన్ నరసింహ మూర్తి బాధ్యత తీసుకొని కేవలం 8నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేసి పలువురు అభినందనలు అందుకున్నారు. బాపులపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ సరిపల్లి కమలా కిరణ్ విజయవాడ రోడ్ రాజుల కాలనీలో ఉన్న 29 సెంట్ల స్థలంలో పది సెంట్లను సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి అందించారు. మిగతా స్థలాన్ని పిల్లలు ఆడుకునేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అందమైన పార్క్ తీర్చిదిద్దారు. దీని నిర్మాణానికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ చొరవతో దాతలు ముందుకు వచ్చి సహకరించారు. అనేకమంది దాతల సహకారంతో అధునాతనమైన సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

ఏపికి ఒరగిందేమీ లేదు

ప్రజాశక్తి – యంత్రాంగం : పార్లమెంట్‌లో గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై వివిధ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల నేతలు స్పందించారు. ఎపి ఒరిగిందేమీలేక పోగా తీవ్ర అన్యాయం జరిగిందనిఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నాయకులు వక్కలగడ్డ భాస్కరరావు పేర్కొన్నారు. అప్పటి, ఇప్పటి కేంద్ర పాలకులు ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో ఎపి మరింత అన్యాయానికి గురైందన్నారు. టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం స్పందిస్తూ స్మార్ట్ సిటీ జాబితాలో కేంద్రం పేర్కొన్న అమరావతి రాజధాని అభివృద్ధిపై కేంద్ర బడ్జెట్లో ఊసే లేకుండాపోయిందన్నారు. ఏ విధమైన ప్రాజెక్టులు లేవు. రాష్ట్రం అడిగిందీ లేదు, కేంద్రం ఇచ్చిందీ లేదు. కేంద్రం మరోసారి మోసం చేసిందన్నారు. సిపిఎం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కార్యదర్శులు డి.వి.కృష్ణ, వై.నరసింహారావు స్పందిస్తూ ఫసల్ బీమా గురించి గొప్పలు చెప్పినా మిచౌంగ్ తుపానుకు నష్టపోయిన రైతులకు అది ఏ విధంగానూ ఉపయోగపడలేదనే వాస్తవం కళ్లముందే ఉందన్నారు. కృష్ణాజిల్లాలోని కోస్తాతీర ప్రాంత అభివృద్ధికి అవసరమైన కోస్తా లింకు రైలు మార్గం, విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలను ప్రభుత్వం ప్రకటించడలేదన్నారు. అలాగే విజయవాడ మెట్రో ప్రాజెక్టును కేంద్రం మరిచిపోయిందని విమర్శించారు. సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ స్పందిస్తూ రాజధాని అభివృద్ధి ప్రస్తావనే లేదన్నారు. ఉద్యోగవర్గాలను నిరుత్సాహపరిచిందని ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ పేర్కొన్నారను. ఆదాయ పన్నులో మార్పులేకపోవడం, రాయితీని పెంచకపోవడం ఉద్యోగవర్గాలను నిరుత్సాహపరిచింది. వ్యవసాయ రంగం పట్ల చిన్నచూపు చూసిందని ఎపి రైతు సంఘం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, పివి.ఆంజనేయులు పేర్కొన్నారు. శాస్త్రీయంగా రుజువు కాని నానో ఎరువులను రైతులపై రుద్దడానికి కేంద్రం చూస్తోందన్నారు.

విజయవాడ ఆర్‌డిఒగా భవానీశంకర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ ఆర్‌డిఒగా బిహెచ్.భవానీ శంకర్ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సబ్ కలెక్టర్ అతిదిసింగ్ బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఆర్‌డిఒగా భవానీశంకర్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావును, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌లను భవానీశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు కలెక్టర్, జెసి శుభాకాంక్షలు తెలిపారు.



మొదటిపేజీ తరువాయి

మెట్రో రైలు ఇక లేనట్లేనా ?

మొత్తంగా 66 కిమీ వరకు మెట్రో లైన్లు వేయాలని నిర్ణయించారు. దీనిలో 26 కిమీ మేరకు భూగర్భ లైన్లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. మొత్తం 51 మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయాలని, వీటిలో 34 భూమి ఉపరి తలంపైన, 17 స్టేషన్లు అండర్‌గ్రౌండ్‌లో నిర్మించాలని నిర్ణయించారు. మూడు దశల పనులను సుమారు రూ.15 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు నిపుణుల నేతృత్వంలో రూపొందించిన ప్రతిపాదనలు కేంద్రానికి కూడా పంపారు. దాదాపు 2016 నుంచి నేటి వరకు విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు అన్యాయమే జరుగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆవశ్యకత

విభజన అనంతరం రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విజయవాడ ఒకటి. ఈ నగరం చుట్టుపక్కల ప్రాంతాలకు మెట్రో అవసరం ఎంతో ఉంది. నగరంలో ఫ్లైఓవర్లు నిర్మించినా ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. రానున్న రోజుల్లో ఇది ఇంకా తీవ్రతరం అయ్యే అకాశం ఉంది. దీంతో ప్రజలు సుఖంగా, సౌకర్యవంతంగా, వేగంగా గమ్య స్థానాలకు చేరేందుకు నానావస్థలు పడాల్సి వస్తోంది. మెట్రో రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థ ఉండే ఈ కష్టాలన్నింటికి ఫుల్ స్టాప్ పెట్టొచ్చు.

నాలుగు సీట్లపై వీడని ఉత్కంఠ

అయ్యారు. కొద్దికాలం నియోజకవర్గంలో కార్యకలాపాలను సాగించిన ఆయన ఇటీవల మళ్లీ మౌనంగా ఉండిపోయారు. అడపాదడపా పలు వ్యాఖ్యలు చేస్తూ వైసిపి శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నారు. ఈలోగా మంత్రి జోగి రమేష్‌కు పెనమలూరు కేటాయించడంతో ఈ ప్రస్తావన అంతటితో ముగిసింది. అయితే గత రెండు రోజుల నుండి ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ నియోజకవర్గంలోని పార్టీ నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో లేకుండా పోయారు. ఆయన హైదరాబాద్ వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి 3న ఏలూరులో జరిగే సిఎం జగన్మోహనరెడ్డి 'సిద్ధం' బహిరంగ సభకు కూడా తాను అందుబాటులో ఉండలేనని ఆ పార్టీ అధిష్టానానికి చెప్పినట్లు తెలిసింది. అంతేగాక ఆ సభకు కార్యకర్తలను తాను తరలించలేనని చెప్పినట్లు తెలిసింది. ఈపరిణామాలు వైసిపి అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. దీంతో 'సిద్ధం' సభకు కార్యకర్తలను తరలించే బాధ్యతను వైసిపి విజయవాడ ఎంపి అభ్యర్థి కేశినేని నాని చూస్తున్నారు. మరోవైపు ఎంఎల్‌సి తలశిల రఘురామ్ మైలవరం స్థానంపై కన్నేసినట్లు చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సన్నిహితుల్లో ఆయన ఒకరు. యువజన కాంగ్రెస్ నేతగా పనిచేసిన ఆయన వైఎస్ఆర్ మరణం అనంతరం వైసిపిలో చేరారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగాను, ఆ పార్టీ కార్యక్రమాల సమన్వయ కర్తగాను పని చేశారు. 2021లో ఆయనకు సిఎం జగన్ ఎంఎల్‌సిగా అవకాశం కల్పించారు. అంతేకాకుండా వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్‌గానూ వ్యవహరిస్తున్నారు. మైలవరం నియోజకర్గానికి చెందిన ఆయన....స్థానికుడు కావడం, సిఎం వద్ద మంచి పలుకుబడి ఉండడం వంటి పరిస్థితుల నేపథ్యంలో మైలవరం స్థానం ఆశిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ తూర్పు ఇన్చార్జులను ఇంకా ప్రకటించలేదు. జగ్గయ్యపేట, నందిగామలకు అధికార పార్టీ ఎంఎల్‌ఎ సామినేని ఉదయభాను, మొండితోక జగన్మోహనరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. విజయవాడ తూర్పు వైసిపి ఇన్చార్జిగా దేవినేని అవినాష్ వ్యవహరిస్తున్నారు. సిఎం సూచన మేరకు ఆయన తన నియోజకవర్గంలో కలియ తిరుగుతూ పని చేసుకుంటున్నారు. అయితే ఈ ముగ్గురికీ ఇంకా సీట్లు ఖరారు కాకపోవడం, మరోవైపు స్థాన బదిలీలు జరుగుతుండటంతో వారిలో ఒకింత ఆందోళనలు నెలకొన్నాయి. మరోవైపు ఇప్పటికే ప్రకటించిన సెంట్రల్ సీటులో ఇంకా వెలంపల్లి, మల్లాది విష్ణు మధ్య సయోధ్య కుదరలేదని తెలిసింది. విష్ణు వర్గం సహకరించకపోవడంపై వెలంపల్లి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వారిద్దరితో పార్టీ పెద్దల వద్ద గురువారం మరోసారి 'పంచాయితీ' జరిగే అవకాశం ఉందని తెలిసింది.

పశ్చిమ సీటివ్వాలని బుద్ధా వెంకన్న ర్యాలీ

రాలేదని ఎవరైనా చంద్రబాబుని విమర్శిస్తే తాట తీస్తానని హెచ్చరించారు. చంద్రబాబు తనకు దైవ సమానులని, చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తానని చెప్పారు. తనకు టికెట్ కేటాయించాలని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దర్నీ కోరుతున్నానన్నారు. ప్రాణాలకు తెగించి టిడిపి కోసం పోరాడుతున్నానని, ఎన్నికల్లో నిలబడటానికి తనకు అన్ని అర్హతలూ ఉన్నాయని వెంకన్న చెప్పారు. కేశినేని నానికి బుద్ధి చెప్పాలని ర్యాలీగా వచ్చానని, నాని వాపును చూసి బలుపు అనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపి భూహక్కు చట్టం-2022ను ఐక్యంగా వ్యతిరేకించాలి

మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎవరైతే ప్రజల భూములకు హక్కులు కల్పించకుండా హక్కులు కాలరాస్తున్నారో వారికే ప్రభుత్వం జుడిషియల్ అధికారాలు ఇచ్చిందని, దొంగచేతికే తాళాలు ఇచ్చినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా చేసిన ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయి ఈ చట్టాలను చేసిందన్నారు. భూ యజమానులు సమస్యలపై హైకోర్టు స్థాయి వరకు కోర్టులకు వెళ్లకుండా చేయడమంటే సామాన్యులకు న్యాయం దక్కకుండా చేయడమే అవుతుందన్నారు. న్యాయ వ్యవస్థ అధికారాల్లో జోక్యం చేసుకుంటూ భూమి హక్కులను నిర్ధారించే అధికారాన్ని ఎటువంటి న్యాయపరిజ్ఞానం లేని రెవిన్యూ అధికారులకు అప్పగిస్తోందన్నారు.

పలువురు ఎండిఒల బాధ్యతల స్వీకరణ



తోట్లవల్లూరు ఎండిఒకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం



చల్లపల్లి ఎండిఒకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండల నూతన ఎంపీడీవోగా ఐ సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా గతంలో పనిచేసిన టి స్వర్ణలత పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లడంతో గుంటూరు జిల్లా రేపల్లె మండలం నుంచి ఐ సత్యనారాయణ తోట్లవల్లూరు మండలం ఎంపీడీవో గా వచ్చారు.

చల్లపల్లి ఎంపీడీవోగా నాగలక్ష్మి

ప్రజాశక్తి-చల్లపల్లి మండల నూతన ఎంపీడీఓ ఎన్.నాగలక్ష్మి గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లా నిజాంపట్నం నుంచి ఆమె బదిలీపై చల్లపల్లి ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఏవో శ్యాంసన్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఈఓ పేర్ని మాధవేంద్రరావు, శానిటరీ అధికారి సుధాకర్, చల్లపల్లి పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు అనితలు సత్కరించారు.

ఉయ్యూరు ఎండిఒ విమాదేవికి సత్కారం

ప్రజాశక్తి ఉయ్యూరు : ఉయ్యూరు నుంచి బదిలీపై వెళుతున్న ఎంపీడీవో విమాదేవిని టీడీపీ సర్పంచ్లు, ఎంపీటీసీలు గురువారం ఘనంగ సత్కరించి వీడ్కోలు పలికారు. ఉయ్యూరు మండల పరిషత్ అధికారిణిగా పనిచేసి బదిలీపై గుంటూరు జిల్లాకు వెళుతున్న విమాదేవిని ఆకునూరు, చినఓగిరాల, జబర్లపూడి, సాయిపురం సర్పంచ్లు గోలి వసంతకుమార్, యెనిగళ్ల శిరీష, సూరపనేని వరప్రసాద్, షేక్ జాన్ భాష, కాటూరు ఎంపీటీసీ సజ్జా ఆ నూష, టీడీపీ మండల అధ్యక్షుడు కుటుంబరావు తదితరులు శాలువాతో సత్కరించారు

పెదపారుపూడి తహసీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-పెదపారుపూడి : పెదపారుపూడి మండలం నుండి బదిలీపై తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల తహసీల్దార్గా వెళ్తున్న పెదపారుపూడి తహసీల్దార్ వి. నాగభూషణంను సిబ్బంది గురువారం ఆయన కార్యాల యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వీఆర్వోల ఉద్యోగ సంఘ అధ్యక్షుడు చాట్ల అజయ్ కుమార్, ,వీఆర్వోలు ప్రసాద్ ,భగవంతురావు, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

విసన్నపేట ఎండిఒగా విజయ కుమారి బాధ్యతలు

ప్రజాశక్తి-విస్సన్నపేట: నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎంపీడీవో జి.విజయ కుమారి బాధ్యతలు తీసుకున్నారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం నుంచి వచ్చినట్లు ఆమె చెప్పారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఎంపీడీవో ఎస్ వెంకటరమణ పలల్నాడు జిల్లా దాచేపల్లి మండలానికి బదిలీ అయ్యారు.



తాతినేనికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాతినేని శివరామబ్రహ్మంకు ఘన నివాళి

ప్రజాశక్తి-పమిడిముక్కల : తాతినేని శివరామబ్రహ్మం తెలుగు దేశం పార్టీకి, కపిలేశ్వరపురం గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం శివరామబ్రహ్మం వర్ధంతి సందర్భంగా కపిలేశ్వరపురంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తాతినేని శివరామ బ్రహ్మం కపిలేశ్వరపురంలో గ్రామపంచాయతీ నిర్మాణం,కళ్యాణ మండపం, శివాలయం నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఎన్టీ రామారావు, నారా చంద్రబాబునాయుడు, అన్నే బాబురావు వంటి మహా నాయకులతో కలిసి పని చేశారన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ శివరాం, బ్రహ్మం భార్య వాణి కుమారి, దండమూడి లక్ష్మి కుమారి, పెదపారుపూడి తెలుగుదేశం పార్టీ నాయకులు రమేష్ చౌదరి, వీరంకి వెంకట గురుమూర్తి, మండల మాజీ జెడ్పిటిసి మోటూరు వెంకట సుబ్బయ్య, జక్కా శ్రీనివాసరావు, కుమ్మరి రామారావు పాల్గొన్నారు.

దద్దరిల్లిన కంచికచర్ల మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ అధ్యక్షుడు మలక్ బషీర్ అధ్యక్షతన జరిగింది. సమావేశం మొదలుకాగానే ఎంపీటీసీ గ్రామ సర్పంచ్లను వైసీపీకి చెందిన వాళ్లు మాత్రమే రావటం తదుపరి సమావేశ హాలులో మీడియా మిత్రులకు కూడా రావటానికి నిరాకరించారు. ముఖద్వారం వద్దనే పోలీసులను ఏర్పాటు చేసి స్థానిక వైయస్సార్సీపి ప్రజాప్రతిని ధులను మాత్రమే లోపలికి అనుమతించారు. మొదటి నుంచి ఎంపీపీ మలక్ బషీర్ స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల అలసత్వం ప్రదర్శించటం కార్యక్రమాలు నిర్వహణలో ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయకపోవడం ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహణలో కూడా ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా తూతూ మంత్రంగా చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ముఖ్యంగా పెండ్యాల గ్రామానికి చెందిన మరొక ఎంపీటీసీ సభ్యుడు బడే హజరత్ తీవ్రస్థాయిలో ఎంపీపీ మలక్ బషీర్ పై విరుచుకు పడ్డారు. మండల పరిషత్ నిధులు కేటాయింపులో కూడా ఎంపిపి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అందరూ వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎంపీపీ మలక్ బషీర్ ని వ్యవహార శైలి నచ్చటం లేదని త్వరలోనే ఎంపీపీ మార్పు ఉంటుందని బహిరంగంగానే కొంతమంది వైసీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

గంపలగూడెం ఎస్ఐగా శ్రీను బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-గంపలగూడెం: గంపలగూడెం ఎస్సైగా సీలు బోయిన శ్రీను గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీను ఇప్పటివరకు రెడ్డిగూడెం మండలంలో విధులు నిర్వహించి గంపలగూడెం రాగా, ఇక్కడ పనిచేసిన పి రాంబాబు కంచికచర్ల మండలానికి బదిలీ అయ్యారు.

ఎంఎల్ఎకు సమస్యలపై వినతి

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని స్వగృహంలో గుడ్‌మేన్ పేటకు చెందిన పలువురు, నియోజవర్గానికి చెందిన పలు సమస్యలను ఎంఎల్ఎకు గురువారం తెలిపారు. ప్రజల నుండి సమస్యలు తెలుసుకున్న కొడాలి నాని అధికారులతో ఫోనులో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

జడ్జికి సన్మానం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టులో కృష్ణాజిల్లా ఫోర్ట్ పోలియో జడ్జి ఎవి శేషసాయిను గురువారం నందిగామ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా తన చాంబర్లో కలిసి సన్మానించారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి పి ప్రకాష్, 16వ జిల్లా అదనపు కోర్టు ఏపీపీ ఈ రంగారావు పాల్గొన్నారు.

రెండో రోజుకు నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: దేవుని రక్షణ ప్రణాళిక నెరవేర్చడంలో మరియమాత పాత్ర విశిష్టమైనదని విశాఖపట్నం మేత్రాసనం రెవరెంట్ ఫాదర్ పసుపులేటి యుగల్ కుమార్ తెలిపారు. గుణదల లూర్ధు మాత నూరు వసంతాల మహోత్సవాల నవదిన ప్రార్థనలో భాగంగా గురువారం రెండవరోజు జరిగిన నవదిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణదల మాత అధ్యాత్మిక తల్లిగా భక్తుల చేత కొనియాడ బడుతుందన్నారు. మరియతల్లి గుణదల మాతగా విరాజిల్లుతూ మన హృదయాలలో కొలువైం దన్నారు. విజయవాడ గుణదల కొండపై కొలువై ప్రేమ మనందరిపై కలిగి ఉండటం వలన ఈనూరు వసంతాల మహోత్సవాలను జరుపుకోవడమే అందుకు నిదర్శనమన్నారు. అంతకుముందు విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ రెవరెంట్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ రెవరెంట్ ఫాదర్ యం.గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెంట్ ఫాదర్ తోట సునీల్ రాజు తదితర గురువులతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ పి.యుగల్ కుమార్‌తో కలసి దివ్యసత్ప్రసాదంతో ప్రదర్శనగా కొండపై మరియమాత గుహవద్దకు చేరుకున్నారు. గుహ వద్ద ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై గురువులు సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ ఘంటాప్రవీణ్, ఫాదర్ బి.ఫ్రాన్సిస్, ఫాదర్ లింగతోటి రత్నకిషోర్, ఫాదర్ యం. సాల్‌మన్, మఠకన్యలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఉద్యోగ విరమణ సత్కారం



ప్రజాశక్తి-గుడివాడ : పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన రాష్ట్ర బీసీ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి గులిపల్లి ప్రభాకరరావును పలువురు సత్కరించారు. బుధవారం రాత్రి స్థానిక వెలమ సంక్షేమ సంఘ భవనంలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదవీ విరమణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా విజయవాడ వెలమ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మూకల అప్పారావు, కోశాధికారి గంటా శ్రీనివాసరావు లతో కలసి డాక్టర్ గోర్జి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. పట్టణ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట ఆనంద్, కోశాధికారి వర్రే శ్రీనివాసరావు ,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు కమల్ అహ్మద్ పదవి విరమణ

గుడివాడ ఆర్‌టిసి డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడిగా 34 ఏళ్లుగా డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కమల్‌అహ్మద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని డిపో గ్యారేజ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ 34 ఏళ్లుగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న కమల్ ఆదర్శప్రాయుడన్నారు.. అనంతరం ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు కమల్ అహ్మద్ దంపతులను దుశాల్వాలు,పూల దండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ, ఆర్టిసి సీఐ సత్యనారాయణ, హెడ్ క్లర్క్ శ్రీనివాసరావు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు యం.వి.రమణ, కార్యదర్శి కె.ఎస్ రావు, వివిధ యూనియన్ నాయకులు దారం ఏడుకొండలు, గ్యారేజీ కార్యదర్శి రాజేష్, కమల్‌అహ్మద్ కుటుంబ సభ్యులు, పలు కార్మిక సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం : జనసేన

ప్రజాశక్తి కోడూరు : ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నియోజవర్గ అబివృద్ధిని పట్టించుకోలేదని కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావంతులు, ఉద్యోగులు, యువత, రైతాంగంతోపాటు అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుత వైసిపి పాలనలో అంత విసుగపోయారన్నారు. అలాగే ఉన్నతమైన వైద్య వృత్తిలో డాక్టర్ చంద్రశేఖర్ అవనిగడ్డ వైసిపి అభ్యర్థిగా పోటీకి ముందుకు రావడం దురదుష్టకరమన్నారు. యర్రంశెట్టి దామోదర్ రావు, జనసేన నేతలు తోట దామోదర్ రావు, జరుగు ఆదినారాయణ, మేడ పిచ్చయ్య పాల్గొన్నారు.

వైసిపికి రాజీనామా

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో గన్నవరం నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ సదస్సు వేదికగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. యూత్ ప్రసిడెంట్ కర్రా ప్రసాద్,గ్రామ పార్టీ కన్వీనర్ నిమ్మకూరు శేఖర్, విద్యార్థి విభాగం నాయకులు వట్టి సాయి గణేష్, యువజన విభాగం నాయకులు ఇడుపులపాటి దిలీప్ కుమార్,బాపులపాడు 2వ వార్డు మెంబర్ కడవకొల్లు నాగరాజు, 12వ వార్డు మెంబర్ తాడిశెట్టి శ్రీనివా సరావు, కడవకొల్లు రాజేష్ తదితర వైసీపీ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. యార్లగడ్డ వెంకట్రావు సారద్యంలో పనిచేయ డానికి త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థికి పతకాలు

ప్రజాశక్తి-మైలవరం : ఈ నెల 16వ తేదీ నుండి 21 వరకు రాజస్థాన్ లోని సవై మాదాపూర్ లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్స్, సీనియర్స్ తైక్వాండో ఛాంపియన్ షిప్ లో స్థానిక ఎల్బీఆర్‌సిఈ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించిన యల్.బి.ఆర్.సి.ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థి షేక్ చాన్ బాషా పసిడి, రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని, ట్రైనింగ్ ఇచ్చిన ఫిసికల్ ఎడ్యుకేషన్ విభాగా టధిపతి డా. ఎన్వి .రాజ్ కుమార్, అసిస్టెంట్ పిడిలు ఎస్.దుర్గారెడ్డి, ఎమ్. బేబీరాణిలను కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

దోమల బెడదను అరికట్టాలి : సిపిఐ

ప్రజాశక్తి-భవానీపురం: నగరంలో ప్రజలపై దోమలు దండయాత్రతో ఒకవైపు ప్రజలు కంటిమీద కునుకు లేకుండా అల్లాడుతుంటే మరోవైపు అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు మాత్రం మొద్దునిద్ర నటిస్తున్నారని సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మండిపడ్డారు. కనీసం కార్పొరేషన్ అధికారులు అయినా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడకుండా ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. నగరంలో దోమల నివారణలో పాలకపక్షం ఘోర వైఫల్యాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో కోటేశ్వరరావు స్వయంగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పాలకపక్షం, అధికారులు స్పందించకపోతే నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఎర్రసాని జోసెఫ్, సైకం నారాయణరెడ్డి, ఎస్.కె ఉస్మాన్ పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన ఎం.జి.రోడ్డు పాతూరి టవర్స్‌లోని అజంట్ విజయవాడ క్యాంపస్‌లో ఎడ్యుకేషన్ ఫెయిర్, విదేశీ విద్యపై అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు అజంట్ విజయవాడ శాఖ మేనేజర్ ప్రశాంత్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో విదేశీ విద్య అవగాహనా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యుకెలలో ఉన్నత విద్యను చదవాలనుకునే వారికి అవగాహన కల్పించడం కోసం ఆయా దేశాలకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విజయవాడ వచ్చి అవగాహన కల్పించనున్నారని తెలిపారు. 20 దేశాలకు చెందిన ప్రముఖులు నగరానికి రానున్నారని తెలిపారు. ఆయా వర్శిటీల ప్రతినధులతో విద్యార్థులు స్వయంగా మాట్లాడి వారికి నచ్చిన కోర్సులలో అడ్మిషన్ తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగే సదస్సులో కోర్సులు, స్కాలర్‌షిప్, ఐఇఎల్‌టిఎస్ పరీక్ష, విద్యా రుణాలు, విసా తదితర వాటిని గురించి తెలియచేయడంతో పాటు విదేశాలలో చదవాలనుకునే వారికి అన్ని సౌకర్యాలను కల్పించనున్నారని తెలిపారు. వివరాలకు 0866-6912525 ఫోన్ ద్వారా సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా బడ్జెట్ లేదు

కెబిఎన్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ల సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్ నామమాత్రంగానే ఉందని పలువురు చార్టర్ట్ అకౌంటెంట్లు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల యుజీ, పీజీ కామర్స్ అండ్ మేనేజమెంట్ స్టడీస్ విభాగాల సయుక్త ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ అమరసుధీర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుతం పెట్టిన బడ్జెట్ ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్ మాత్రమేనన్నారు. కేవలం కొద్ది మాసాలకు ప్రభుత్వం చేసే ఖర్చులకు సంబంధించిన ఆమోదానికి సాధారణంగా ఈ విధమైన బడ్జెట్‌ను పెడతారన్నారు. అయితే ఎన్నికల నేపథ్యంలో చాలా మందికి అనేక ఆశలు ఉంటాయన్నారు. వాటిని మంత్రి తన ప్రసంగంలో పెద్దగా వివరించలేదన్నారు. చాలా వరకూ గడిచిన పాలనలో తమ ప్రభుత్వం చేసిన అభివద్ధి అంశాలను మంత్రి వివరించే ప్రయత్నం చేశారన్నారు. అదేవిధంగా గత ఏడాది ప్రకటించిన ఏడు లక్షల ఆదాయ పరిమితిని ఇప్పుడూ ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ బీవీఎస్ లింగమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, హేమంత్, రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్లో అభివద్ధి పనులను సిపిఎం ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ బి.సత్యబాబు గురువారం ప్రారంభించారు.



డివిజన్లో మహంతిపురం, గొల్లపాలెం గట్టు ప్రాంతాల్లో పాడైపోయిన కల్వర్లులు, వాటర్ పైపులు కోసం తవ్విన రోడ్డు ప్యాచ్ వర్క్ లు మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కి కార్పొరేటర్ బి. సత్యబాబు ఫిర్యాదు చేయగా రూ.7.57 లక్షల అంచనాలతో జనరల్ బడ్జెట్ నందు మంజూరు చేసి ఉన్నారు. ఈ పనులను గురువారం రాఘవరెడ్డి రోడ్డు వద్ద సత్యబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఎంసి సర్కిల్-1 ఎఇ శ్రీనివాస్, స్థానిక పెద్దలు సూర్యనారాయణ, ఎస్‌కే సలీం, ఎస్ సూరిబాబు, మల్లేశ్వర తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహనా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: విదేశాలలో ఉన్నత విద్యావకాశాలపై ఈ నెల 2వ తేదీన నగరంలోని హోటల్ ఫార్ఛ్యున్ మురళి హోటల్‌లో ఉచిత అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు గ్లోబల్ ట్రీ సంస్థ ఇన్‌ఛార్జి వై.కపర్థి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఉచిత విద్యా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికా, కెనడా దేశాలలో ఉన్నత విద్యను చదివేందుకు మన రాష్ట్రం నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. అయితే సరైన గైడెన్స్ లేక కోర్సుల ఎంపికలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. అటువంటి వారి కోసం అమెరికా, కెనడా దేశాలలోని ఉన్నత విద్యా కోర్సుల వివరాలు, ఆయా విశ్వవిద్యాలయాలు అందించే స్కాలర్‌షిప్స్, హాస్టల్ వసతి, ఇతర సౌకర్యాలు వంటి వాటిరి ప్రముఖ వర్శిటీ ప్రతినిధులచే అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అమెరికాలోని వెబ్‌స్టార్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఈ అవగాహనా సదస్సు జరుగుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగే సదస్సులో అమెరికా, కెనడా దేశాలకు చెందిన వర్శిటీ ప్రతినిధులు స్పాట్ అడ్మిషన్స్ సౌకర్యం కూడా వివిధ కోర్సులలో అందిస్తున్నారని తెలిపారు. సదస్సుకు హాజరైన వారికి ప్రత్యేక బహుమతులు కూడా ఉంటాయన్నారు. వీటితో పాటు గ్రీ, జిమ్యాట్, ఐలెట్స్, శాట్, టోఫెల్ పరీక్షలపై కూడా అవగాహన కల్పిస్తారని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బ్రాంచి మేనేజర్ ఎం.మేఘన, బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బిరుదుల సందీప్ పాల్గొన్నారు.

సర్వీసు కాలం పొడిగింపు అంశం వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ:

విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మాతా శిశు రక్షణ కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది సర్వీసు కాలం పొడిగింపు అంశం వాయిదా పడింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన గురువారం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆయా అంశాలపై జరిగిన చర్చల్లో పలు అంశాలు వాయిదాపడగా, పలు అంశాలను ర్యాటిఫై చేశారు. మరికొన్ని అంశాలను ఆమోదించేశారు. నగరంలోని రామరాజ్యనగర్ మునిసిపల్ మెటర్నిటీ హెూమ్, అలాగే రాజీవ్‌నగర్‌లోని మునిసిపల్ మెటర్నిటీ హెూమ్, కృష్ణలంక మునిసిపల్ మెటర్నిటీ హెూమ్ ...మూడు సెంటర్లలో కాంట్రాక్ట్ పద్ధతిలో అత్యవసర సేవలు అందిస్తున్న 14 మంది వైద్యసిబ్బంది సర్వీసు గడువు ఈ ఏడాది మార్చి 31తేదీకి ముగుస్తుంది. తిరిగి వచ్చే ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 తేదీ వరకు (ఒక ఏడాది) సర్వీసు గడువు పొడిగించాల్సిన అంశాన్ని స్టాండింగ్ కమిటీ వాయిదా వేసింది. అదే విధంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయుర్వేదిక్, యునానీ ఆస్పత్రుల్లో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పది మంది డాక్టర్ల సర్వీసు గడువు ఏడాది పాటు పొడిగించాల్సిన అంశాన్ని వాయిదా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు పది మంది డాక్టర్ల సర్వీసు గడువు పొడిగించాల్సిన అంశం వాయిదా పడింది. దెబ్బతిని ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా తయారయిన 30వ డివిజన్ మధ్య కట్ట వెస్ట్ ఏరియాలోని మెయిన్ రోడ్డును మరమ్మతు పనులు ప్యాచ్ వర్క్ చేసి, సింగల్ బిసి లేయరు వేయడానికి సాధారణ నిధుల నుంచి రూ.30.92 లక్షలు వెచ్చించడంతో పాటు పలు పనులకు స్థాయి సంఘం తీర్మానించింది. ఈ సమావేశంలో స్థాయి సంఘం సభ్యులు తాటిపర్తి కొండారెడ్డి, మరుపిళ్ల రాజేష్, బంకా శకుంతలాదేవి, ఎం మాధురి, అదనపు కమిషనర్ (జనరల్) కె శకుంతల, అదనపు కమిషర్ (ప్రాజెక్టు) కెవి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, సెక్రటరీ కె వసంతలక్ష్మీ, ఎఇ కె నరసింహమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ డిఎస్‌పిగా రవికిరణ్

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా డాక్టర్ రవికిరణ్ నియమితులయ్యారు. ప్రస్తుతం విజయవాడ సౌత్ జోన్ ఏసీపీగా రవికిరణ్ విధులు నిర్వహిస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా అధికారులు నందిగామకు బదిలీ చేశారు. గతంలో డాక్టర్‌గా చేస్తూ పోలీస్ పరీక్షలో డైరెక్ట్ డీఎస్పీగా సెలెక్ట్ అయ్యారు. రవికిరణ్ విజయవాడలో ప్రజల నుంచి మంచి ఆదరణ పొందారు. ఇటీవల డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు.

గెలాక్సీ ఎస్ 24కు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: శాంసంగ్ కంపెనీ ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ఎస్ 24 సిరీస్‌కు వినియోగదారుల వద్ద నుండి మంచి స్పందన లభిస్తుందని మేడ్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా తయారు చేశారని శాంసంగ్ ఎం.జి.రోడ్డు షోరూమ్ ప్రతినిధి కె.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ ఫోన్‌లను అందించడంలో శాంసంగ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఇందులో భాగంగా గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 24 ప్లస్, ఫోన్లకు మంచి స్పందన ఉందని ముఖ్యంగా యువత ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వీటిలో ప్రదానంగా ఇంటర్‌ప్రెటర్, ఛాట్ అసిస్ట్, నోట్ అసిస్ట్, ట్రాన్స్ స్రిప్ట్, వంటి ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఈఫోన్లు నగరంలోని శాంసంగ్ షోరూమ్‌లతో పాటు అన్ని ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లలోలభ్యమవుతాయని తెలిపారు.

కేశినేని నానికి విశ్వాసం లేదు : చిన్ని



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ ఎంపీ, వైసిపి నేత కేశినేని నానిపై ఆయన సోదరుడు, టిడిపి నేత కేశినేని చిన్ని మరోసారి విరుచుకుపడ్డారు. కేశినేని నానికి విశ్వాసం లేదని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.కేశినేని నాని వైసీపీలో చేరడంతో సైకోలందరూ ఒకే చోటకు చేరినట్టయిందని అన్నారు. విజయవాడ లోక్ సభకు కేశినేని నాని పోటీ చేస్తే కచ్చితంగా 3 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోతాడని జోస్యం చెప్పారు. అయితే, విజయవాడ టికెట్‌ను నానికి ఇచ్చే అంశంలో వైసిపి నాయకత్వం ఇంత వరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. టిడిపిలో ఉన్నప్పుడు కేశినేని నానికి చాలా గౌరవం ఉండేదని అన్నారు. కానీ వైఎస్ఆర్‌సిపిలోకి వెళ్లిన తర్వాత ఆయన స్థాయి దిగజారిందని చిన్ని చెప్పారు. దేవినేని అవినాశ్ కు ముఖ్య అనుచరుడిగా నాని మారారని ఎద్దేవా చేశారు. విజయవాడ నుంచి తాను బరిలోకి దిగే అంశాన్ని పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని చెప్పారు. టికెట్ల కేటాయింపులపై తమ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ చర్చిస్తారని చెప్పారు. కేశినేని నానిపై పోటీకి తాను సిద్ధమని అన్నారు.

డాక్టర్ రామానంద్‌కు అవార్డు



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ హిందీ అధ్యాపకులు డాక్టర్ పరమానంద్ శుక్లాకు దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'విద్యా వాచస్పతి సరస్వతి' అవార్డు లభించింది. హిందీ విభాగంలో విశేష కృషి చేయడంతో పాటు హిందీ సబ్జెక్టులో చేసిన సేవలకు శుక్లాకు అవార్డు లభించిందని స్కూల్ సీఈవో సుమన్ త్యాగరాజ్, స్కూల్ అధ్యక్షులు టి.మోనికా సుమన్ త్యాగరాజ్‌లు గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అవార్డు గ్రహీత డాక్టర్ పరమానంద్ శుక్లా మాట్లాడుతూ హిందీ భాషలో విశేష కృషి చేసిన వారికి ప్రతి ఏటా విద్యా వాచస్పతి సరస్వతి అవార్డు ఇచ్చి సత్కరిస్తారని ఈఏడాదికి తనకు రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. జనవరి 28వ తేదీన న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందచేశారని తెలిపారు. దేశంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయం రాణీ లక్ష్మీబాయి సెంట్రల్ అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అరవింద్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. దీనితో పాటు గతలో కూడా పలు జాతీయ అవార్డులను సాధించినట్లు తెలిపారు. నేషనల్ గౌరవ్ అవార్డు, విశ్వ రత్న అవార్డు, బెస్ట్ నేషనల్ మోటివేషన్ అవార్డు, బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పరమానంద్ శుక్లాకు పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు, పండితులు అభినందించారు.